## ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది: 10.05.2026** **సమయం: 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. దేశ వికాసానికి రాష్ట్రాల వికాసం ఎంతైనా అవసరమని, 2047 వికసిత్ భారత్ స్వప్నానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.
2. రాష్ట్రాలకు చెందిన వివిధ పెండింగ్ ప్రాజెక్టుల పరిష్కారానికి పిఎంవో లో సింగిల్ విండో వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.
3. ప్రధానమంత్రి సహకారంతో రాష్ట్రంలో గత పదేళ్ళలో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు.
4. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలంటూ 8 కీలకమైన అంశాలను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రికి తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు.

..................................................................................

**నరేంద్ర మోదీ**

దేశ వికాసానికి రాష్ట్రాల వికాసం ఎంతైనా అవసరమని, 2047 వికసిత్ భారత్ స్వప్నానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు హైదరాబాద్ లోని హెచ్ఐసిసి నుంచి సుమారు 9వేల 400 కోట్ల రూపాయల విలువైన ఆరు ప్రాజెక్టులకు వర్చువల్ గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా

ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ గడిచిన 12 యేళ్లలో భారత ప్రభుత్వం మోడర్న్ కనెక్టివిటీమీద ఫోకస్ చేసిందని, ముఖ్యంగా రోడ్లు, రైల్వేలు, ఎయిర్ వేల కనెక్టివిటీ పెంచుతూ దేశ అభివృద్ధికి గణనీయమైన కృషి చేసిందని అన్నారు. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రైల్వేల అభివృద్ధికి వెయ్యి కోట్లు బడ్జెట్ లో కేటాయించగా.. కేవలం తెలంగాణకే ఇప్పుడు బడ్జెట్ లో 5వేల 500కోట్ల రూపాయలు కేటాయింపులు చేశామని, మరో 5వేల కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ స్థాయిల్లో ఉన్నాయని నరేంద్రమోదీ చెప్పారు.

**బైట్ - ప్రధానమంత్రి**

వరంగల్ పీఎం మిత్ర పార్క్ ను ప్రారంభించిన ప్రధానమంత్రి.. భారతదేశంలో టెక్స్ టైల్ పరిశ్రమ పురోభివృద్ధికి పిఎం మిత్ర వరంగల్ పార్కు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సోలార్ పవర్ రంగంలో దేశం ప్రపంచంలోనే ఉన్నత స్థాయికి చేరుకోవడానికి పలు సంస్కరణలు చేపట్టామని ఎల్పీజీ, గ్యాస్, సీఎన్జీ ఆధారిత వ్యవస్థల గురించి విదేశాలమీద ఆధార పడకుండా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఎంఎస్ఎంఈ స్టార్టప్ లు, ఉపాధి, వికసిత్ భారత్ సాధనకు దోహద పడతాయని, తెలంగాణ అభివృద్ధితో దేశాభివృద్ధి, వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అవుతుందని నమ్ముతున్నట్లు ప్రధానమంత్రి చెప్పారు. పదేళ్లలో గుజరాత్ కు ఎంత కేటాయింపులు చేశామో, తెలంగాణకు అదే విధంగా కేటాయింపులు చేసేందుకు సిద్ధమే అని, కానీ, ఇప్పుడు ఇచ్చే వాటికన్నా సగం నిధులు కూడా రావని, దానికి ముఖ్యమంత్రి సిద్ధమేనా అని ప్రధానమంత్రి ప్రశ్నించారు.

**బైట్ – ప్రధానమంత్రి**

జహీరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి, గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులకు, వరంగల్‌లోని ‘పీఎం మిత్ర’ కాకతీయ మెగా

టెక్స్‌టైల్ పార్కుకు, హైదరాబాద్ సమీపంలోని మల్కాపూర్ వద్ద నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ పీవోఎల్‌కు, కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుకు, 21 కి.మీ. కాజీపేట రైల్ అండ్ రైల్ బైపాస్ రైల్వే లైనుకు, ప్రధానమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

ఈ కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్రమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వికసిత్ భారత్ 2047 కోసం 3 ట్రిలియన్ డాలర్ల భాగస్వామ్యం కోసం కృషి చేస్తామన్నారు. దేశ జీడీపీలో పది శాతం తెలంగాణ వాటా ఉండేలా చూస్తామన్నారు.

**బైట్ - రేవంత్ రెడ్డి.**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణలో ప్రారంభించడం అదృష్టమని, జాతీయ రహదారుల అభివృద్ధి, రాష్ట్రంలో 42 రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేయడం సంతోష దాయకమన్నారు. మోదీ సహకారంతో రాష్ట్రంలో గత పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తోందని హర్షం వ్యక్తం చేశారు.

**బైట్ - కిషన్ రెడ్డి**

**మహేష్ కుమార్ గౌడ్**

తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలని ఎనిమిది కీలకమైన అంశాలను ఆ లేఖలో ప్రస్తావించారు

.......డెస్క్

**NHAI**

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ తో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఈరోజు హైదరాబాద్ లో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ - విజయవాడ రహదారి విస్తరణ పనుల ప్రారంభంపై ప్రత్యేకంగా చర్చించారు.

....డెస్క్

**వాకిటి**

నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని కల్వాల్ – సీపూర్ గ్రామాల మధ్య 6 కోట్ల 40 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న రోడ్డు కమ్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి ఈరోజు పరిశీలించారు.

....పిటిసి, నారాయణ పేట

**ఉపాధి హామీ పథకం**

ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఈకైవైసి నమోదుకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు రేపటితో ముగుస్తుందని, గ్రామాల్లో ఎవరైనా మిగిలిన కూలీలు ఉంటే ఈ కేవైసీ చేయించుకోవాలని ఉపాధి హామీ పథకం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల ఎంపిఓ ఇప్ప ధనుంజయ్ తెలిపారు.

......పిటి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**దేవాదాయ కమిషనర్**

బాసర మాస్టర్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఈ రోజు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి పర్యటించారు.

......పిటిసి, నిర్మల్

**వాతావరణం**

ఈరోజు, రేపు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు ముప్పై నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. వాటితో పాటు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

........పీఎన్

**విద్యా వారోత్సవాలు**

తెలంగాణ ప్రభుత్వం "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా రేపటినుంచి నుంచి ఈనెల పదిహేడో తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవం రేపు సాయంత్రం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

.....డెస్క్

**పోటీలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేపు సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ బాల బాలికల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు.

.....పిటిసి, సిరిసిల్ల